క్లుప్తంగా

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి సాదర స్వాగతం



గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పర్యటనకు వచ్చిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తొలిసారిగా వివిధ కార్యక్రమాల్లో హాజరయ్యేందుకు వచ్చిన ఇంద్రసేనారెడ్డికి సాదరంగా ఆహ్వానం పలికి, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పర్యటన అనంతరం ఆయన పశ్చిమగోదావరి జిల్లాకు వెళ్లారు.

కబడ్డీ పోటీలకు ఉర్దూ పాఠశాల విద్యార్థి



కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్ : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఏలూరులోని మౌలానా అబ్దుల్ కలామ్ మునిసిపల్ కార్పొరేషన్ ఉర్దూ పాఠశాల విద్యార్థి ఎస్కే ఇద్రీస్ ఎంపికయ్యాడని హెచ్ఎం ఎస్కే కాజిదబేగం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు అండర్–14 విభాగంలో ఇద్రీస్ సత్తా చాటాడని పేర్కొన్నారు. వచ్చే నెల బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థితో పాటు వ్యాయమ ఉపాధ్యాయుడు టి.శ్రీనివాస్‌ను ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఏడీ అజీమ్, ఉపాధ్యాయులు అభినందించారు.

పీపీఈ కిట్ల అందజేత

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిబ్బంది, ప్రైవేట్ సెప్టిక్ ట్యాంక్ సిబ్బంది 62 మందికి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం ఉదయం మేయర్ చాంబర్లో పీపీఈ కిట్లను అందజేశారు. ఈ కిట్లలో చేతి గ్లౌజులు, ఫుల్ షూట్ డ్రెస్సు, గంషూ, హెల్మెట్, గ్యాస్ మాస్క్, కళ్లద్దాలు మొదలగునవి ఉన్నాయి. కార్యక్రమంలో మేయర్ నూర్జహాన్, కమిషనర్ భాను ప్రతాప్, అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, డీఈ రజాక్, ఏఈ సాయి, కార్పొరేటర్లు దేవరకొండ శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

సేవలకు మంగళం

- సచివాలయాల్లో అందని కీలక సేవలు
- సంక్షేమ పథకాల ఊసేలేని దుస్థితి
- కూటమి సర్కారు నిర్ణయంతో గందరగోళం

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ సర్కారు హయాంలో గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన తీసుకొచ్చారు. పట్టణాల్లో వార్డు, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేస్తూ ప్రజలకు అత్యుత్తమ స్థాయి సేవలు అందుబాటులోకి తెచ్చారు. ప్రతి రెండువేల మంది జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేయటంతో పాటు వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సేవలు అందించారు. నేడు టీడీపీ కూటమి సర్కారు సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా నిర్ణయాలు తీసుకుంటోంది. ఎన్నికల హామీలకు ఎలాగోలా హ్యాండిచ్చిన కూటమి ప్రభుత్వం సచివాలయ సేవలకు సైతం మంగళం పాడేలా ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఒకవైపు వలంటీర్లను తొలగించి ఇంటి ముంగిట సేవలకు ఫుల్‌స్టాప్ పెట్టగా, సచివాలయ ఉద్యోగులకు గౌరవం లేకుండా కించపరిచేలా విధులను అప్పగిస్తూ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ప్రజలకు సచివాలయాల్లో అందే సేవలన్నీ నిలిచిపోవటంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

545 రకాల సేవలు

నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను రూపుదిద్ది, ప్రజలకు 545 రకాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. సచివాలయాలకు అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్స్‌తో పాటు, ప్రజలను నిత్యం అవసరమైన సేవలను ఇంటి సమీపంలోకే తెచ్చారు. ఏలూరు నగరంలో 79 సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఉత్తమసేవలు అందించారు. ఈ సచివాలయాల్లో సుమారు 800 మంది ఉద్యోగులతో పాటు వందలాది మంది వలంటీర్లు ప్రజలకు సేవలు అందించటంలో నిమగ్నమయ్యేవారు.

అర్హులందరికీ పథకాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రజల నుంచి నిత్యం దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు సచివాలయాలు పనిచేస్తూ ఉండేవి. సామాజిక పెన్షన్లు, ఇంటి స్థలాలు, బియ్యం కార్డులు, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆటోవాలలకు వాహనమిత్ర ఇలా పదుల సంఖ్యలో సంక్షేమ పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తూ అర్హులకు ప్రభుత్వం నుంచి పథకాలు అందించటంలో కీలకపాత్ర పోషించేవి. ఆయా సచివాలయాల పరిధిలో ఏ పథకాన్ని ఎంతమందికి, ఎంత సొమ్ము చెల్లించామనే విషయాలను స్పష్టంగా సచివాలయాల వద్ద బోర్డులు పెట్టి మరీ ప్రదర్శించేవారు. కానీ నేడు అవన్నీ మచ్చుకకు సైతం కనిపించని దుస్థితి నెలకొంది.



ఏలూరు రూరల్ ప్రాంతంలోని సచివాలయం (ఫైల్)

ప్రజల ఆగ్రహం

సచివాలయ ఉద్యోగులతోనే సామాజిక పెన్షన్లు పంపిణీ చేయించటం, ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రచారం చేయటం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు తప్ప మరి ఏ పథకానికి సంబంధించి దరఖాస్తులు చేయటం లేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అత్యవసరమైన రేషన్ కార్డులు కానీ, నూతన పెన్షన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, ఇంటి స్థలాలు, ఇతర ఏ పథకానికి సంబంధించి ఆన్‌లైన్ సైట్స్ ఓపెన్ కావటం లేదని ప్రజలు వాపోతున్నారు.

సచివాలయ సేవలు పునరుద్ధరించాలి



సచివాలయాల ద్వారా గత ప్రభుత్వం హయాంలో ప్రజలకు వందలాది సేవలు అందుబాటులో ఉండేవి. వలంటీర్లతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రస్తుతం సచివాలయాల్లో సేవలేమీ అందించటంలేదు. ఈ ప్రభుత్వం కూడా ప్రజలకు సచివాలయాల ద్వారా సేవలను కొనసాగించాలి.

– బండ్లమూడి సునీల్, ఏలూరు వన్‌టౌన్

సంక్షేమ పథకాలు లేవు



ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేసే పరిస్థితి కనిపించటంలేదు. సచివాలయాల ద్వారా ప్రజలకు గతంలో అందించే సేవలను సైతం నిలిపివేయటం దారుణం. కూటమి ప్రభుత్వం రేషన్‌కార్డుల్లో మార్పులు, ఇంటి స్థలాలు, కొత్తగా పెన్షన్లకు దరఖాస్తులు పెట్టుకునే అవకాశం కల్పించాలి.

– సొంగా మధు, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు

ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా ఎండీ షరీఫ్



ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండల ఇన్‌చార్జి ఈవోపీఆర్డీగా పెదవేగి మండలం ఈవోపీఆర్డీ ఎండీ షరీఫ్ నియమితులయ్యారు. పూర్వపు ఈవోపీఆర్డీ ఎం సరళకుమారి బదిలీ కావడంతో ఆమె స్థానంలో షరీఫ్ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహించారు.

నేటి నుంచి అయ్యప్పల భిక్ష కార్యక్రమం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడు శ్రీ బాల అయ్యప్ప క్షేత్రంలో ఈ నెల 27 ఆదివారం నుంచి శ్రీ అయ్యప్ప స్వామి మండల దీక్ష స్వాములకు 13వ వార్షిక భిక్ష కార్యక్రమం ప్రారంభించనున్నట్టు క్షేత్రం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యం మధ్యాహ్నం 12 గంటలకు భిక్ష ప్రదాతచే స్వామి వారికి పూజ, మహా నైవేద్యం, మహా హారతి నిర్వహించిన అనంతరం స్వాములు, భవానీలు, శివ, గోవింద స్వాములకు భిక్ష అందజేస్తామని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు లక్ష్మీ గణపతి హోమం, అయ్యప్ప తారక మంత్ర హోమం, పూర్ణాహుతి ఉంటాయని తెలిపారు.

హెల్మెట్‌తోనే ప్రాణాలకు రక్షణ



హెల్మెట్ ధారణపై అవగాహన కలిగిస్తున్న రవాణా, పోలీస్ అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరిస్తేనే ప్రాణాలకు రక్షణ ఉంటుందని రవాణా తనిఖీ అధికారి భీమారావు, ట్రాఫిక్ సీఐ లక్ష్మణ్ అన్నారు. నగరంలోని ఫైర్ స్టేషన్ సెంటర్, గాంధీ మైదానం, వట్లూరు ప్రాంతాలలో రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారులు ఒకటో పట్టణ పోలీసు అధికారులు సంయుక్తంగా హెల్మెట్ ధారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. సీఐ సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ లక్ష్మణ్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ భీమారావు మాట్లాడుతూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలను నడపాలని సూచించారు. ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారు మృత్యువాత పడుతున్నారని హెచ్చరించారు. హెల్మెట్ వాడకుండా ద్విచక్ర వాహనాలను నడుపుతున్న వారికి హెల్మెట్లను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జి.స్వామి, ఎన్ నెహ్రూ, బి.నరేంద్రబాబు, వైఎస్‌వీ కళ్యాణి, బి.ప్రజ్ఞలతో పాటు ట్రాఫిక్ ఎస్సై రంగారావు, ట్రాఫిక్ సిబ్బంది, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతిలేని బాణసంచా దుకాణాలపై కేసులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అనుమతి లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేసే వారిపై కేసులు నమోదు చేయాలని తహసీల్దార్ జి.శేషగిరి అధికారులను ఆదేశించారు. దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన సమీక్షించారు. బాణసంచా దుకాణాల ఏర్పాటు, బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలకు అనుమతులు తీసుకోవాలని, అనుమతులు లేని కేంద్రాల నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని అన్నారు. బాణసంచా తయారీ, నిల్వ, దుకాణాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. జనావాసాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులకు దూరంగా బాణసంచా విక్రయ దుకాణాలు, తయారీ, నిల్వ కేంద్రాలు ఉండేలా చూడాలన్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రతి దుకాణం వద్ద అగ్ని నిరోధిక సిలిండర్లు, బక్కెట్లలో పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉండాలని తెలిపారు. బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రదేశంలో రెండు ప్రవేశ మార్గాలు ఉండేలా చూడాలని, దుకాణాల మధ్య కనీసం 3 మీటర్ల దూరం ఉండేలా చూడాలని అన్నారు. దుకాణాలు ఏర్పాటు చేసిన చోట ఫైర్ ఇంజిన్లు, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ జి.గాయత్రి, పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, విద్యుత్, తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శేషగిరి

యోగ, క్రీడలతో మేధస్సు పెంపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యోగ, క్రీడలు, వృత్తి విద్యల్లో శిక్షణ ఇవ్వడం వల్ల వారి మానసిక ఆరోగ్యం, మేధస్సు మెరుగుపడుతుందని దివ్య కంప్యూటర్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ బీఎస్ శివారెడ్డి అన్నారు. శనివారం స్థానిక డీసీఈఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పాఠశాల విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో యోగ, క్రీడలు, ఒకేషనల్ టీచర్లను కాంట్రాక్టు పద్ధతిపై నెలకు రూ.15,500 వేతనంతో నియమించనున్నట్టు చెప్పారు. ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన అర్హులు ఫోన్ నెంబర్ 79953 55985లో సంప్రదించాలన్నారు. సమావేశంలో విద్యాంజలి 2.ఓ పథకంలో ఎన్‌రోల్ అయిన డీసీఈఎస్ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడాలి

ఏలూరు (టూటౌన్) : రాష్ట్రంలో అతి పెద్ద పరిశ్రమగా ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించకుండా కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ఎన్డీఏ ప్రభుత్వానిదేనని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే అన్నారు. అక్టోబర్ 31న నిర్వహించే ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవ వాల్ పోస్టర్‌ను శనివారం ఆర్ఆర్‌పేట ఎస్ఆర్‌టు వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు విడుదల చేశారు. డాంగే మాట్లాడుతూ ఏఐటీయూసీ సాధించిన కార్మిక చట్టాలను కేంద్రంలో మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. ఎన్నికల హామీ మేరకు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడాలని లేకుంటే రాష్ట్రంలోని ఎన్డీఏ పార్టీలకు ప్రజానీకం తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ వ్యవస్థాపకుడు చిలుకూరి రమేష్ కుమార్, కోశాధికారి బి.నారాయణరావు నాయకులు నారా శ్రీనివాసరావు, ఎస్ఎంవీ సుబ్బారావు, డి.రవి, పీఎస్‌జీ కుమార్, వంగపండు, శివ, ఎ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వాల్ పోస్టర్ విడుదల చేసిన నాయకులు

ట్రూఅప్ చార్జీల భారాన్ని రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారాలను మోపడం దుర్మార్గమని తక్షణం ట్రూఅప్ చార్జీల భారాన్ని రద్దు చేయాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో–కన్వీనర్ ఆగొల్ల వెంకట కృష్ణారావులు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏఎఫ్‌పీపీసీఏ చార్జీల పేరిట ప్రజలపై రూ.6,072 కోట్లు భారాన్ని విధిస్తూ ఏపీ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించు కోవాలని కోరారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాల్లో అంతర్భాగమైన షరతుల్లో ఇది ముఖ్యమైందని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు నియంత్రిస్తామని, విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామన్న టీడీపీ కూటమి ప్రభుత్వం ఇప్పుడు అమాంతంగా పెంచడం దారుణమని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గంగానమ్మ స్నాన సంబరాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట 41, 42 డివిజన్ల పరిధిలోని గంగానమ్మ, పోతురాజు బాబు ద్వితీయ స్నాన సంబర మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి మీనా, నగర మేయర్ నూర్జహాన్ ముఖ్య అతిథులుగా విచ్చేసి 108 మంది మహిళ భక్తులతో కలిసి కలశాల పాదయాత్రలో పాల్గొన్నారు. నగర వీధుల్లో అమ్మవారి నామస్మరణతో యాత్రగా గంగానమ్మ ఆలయానికి విచ్చేసి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. 42వ డివిజన్‌లో అధిక సంఖ్యలో మహిళలు తమ ఇంటి నుంచి పసుపు నీరు తీసుకొచ్చి 1008 బిందెలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు.



కలశాలతో యాత్రలో పాల్గొన్న మహిళా భక్తులు

దోమల నివారణకు డ్రోన్ వినియోగం



డ్రోన్ సాయంతో దోమల నివారణకు స్ప్రే చేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): నగరలో దోమల నివారణకు అధునాతన డ్రోన్ పరికరంతో స్ప్రేయింగ్ చేయిస్తున్నారు. సుమారు 130 నుంచి 150 ఎకరాలు మనుషులు వెళ్లలేని ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతాల్లో డ్రోన్ ఉపయోగించి స్ప్రేయింగ్ చేయిస్తున్నారు. ఏలూరు కార్పొరేషన్‌కు వచ్చిన డ్రోన్ పరికరాన్ని శనివారం ఉదయం 49వ డివిజన్ రామన్న కోనేరు ప్రాంతంలో మేయర్ నూర్జహాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

దెందులూరు: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో మేదినరావుపాలెం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రధానోపాధ్యాయుడు వి.హరి సీతారామయ్య తెలిపారు. అండర్ 17 విభాగంలో బి.హిమవంశీకృష్ణ సిల్వర్ మెడల్ బి.రత్న బాలాజీ బ్రాంజి మెడల్ సాధించాడని, వీరిని శనివారం పాఠశాలలో హెచ్ఎం, పీడీ ప్రసాద్ అభినందించారు.

కబడ్డీ పోటీలకు పూళ్ల విద్యార్థి

భీమడోలు: పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎస్కే నఫీరుద్దీన్ అండర్–17 కబడ్డీ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం పి.భువనేశ్వరరావు తెలిపారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నఫీరుద్దీన్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఏలూరులోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన నఫీరుద్దీన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం తెలిపారు. ఈనెల 27వ తేదీ నుంచి అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్టు చెప్పారు. పీడీ కె.రాహుల్, క్రీడాకారుడిని హెచ్ఎం, ఉపాధ్యాయులు ఎం సీతారామయ్య, ఎల్ గంగరాజు, సిబ్బంది అభినందించారు.

కేరళ తరహాలో బోనస్ ఇవ్వాలి

భీమడోలు: పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా ధాన్యానికి మద్దతు ధర పెంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. ఈనెల 29న కైకరంలో ధాన్యం మద్దతు ధర, కొనుగోళ్ల సమస్యలపై చేపట్టే రైతు సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ శనివారం పూళ్ల, కురెళ్లగూడెం, భీమడోలు తదితర గ్రామాల్లోని రైతులు, కౌలు రైతులకు కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. కేంద్ర ప్రకటించిన మద్దతు ధర రైతులకు గిట్టుబాటు కాదని, సాగు చేసే వారిలో అత్యధిక శాతం కౌలు రైతులేనని, కౌలుతో కలుపుకుని పెట్టుబడి తడిసిమోపుడవుతుందని వివరించారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వకుంటే రైతులకు ఎండిగడ్డి కూడా మిగలదని తెలిపారు. కేరళ తరహాలో ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతుల జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

వివాదాలకు తావివ్వకుండా ఓటు హక్కు

దెందులూరు: సాగునీటి సంఘాలకు సంబంధించి రైతులకు ఓటు హక్కు కల్పించే విషయంలో వివాదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ డివిజనల్ ఇంజినీర్ గనిరాజు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.సుమతితో కలిసి ఆయన వీఆర్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గనిరాజు మాట్లాడుతూ ఫారం–ఏ రూపకల్పన త్వరితగతిన జరగాలన్నారు. రైతులకు ఓటు హక్కు కల్పించే విషయంలో పూర్తి ఆధారాలతో ఒకటి రెండు సార్లు సరిచూసుకోవాలని అన్నారు. పూర్వపు లిస్టులను పరిశీలించి నిర్ధారించుకోవాలన్నారు. తహసీల్దార్ సుమతి మాట్లాడుతూ సాగునీటి సంఘాలు ఎన్నికలు నిర్వహణ ఓటు హక్కు కల్పన విచారణ విషయాల్లో వీఆర్‌ఓలు నిబంధనలకు లోబడి పనిచేయాలన్నారు. ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే విచారణలో నిరూపణ అయితే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. డీటీ కృష్ణస్వామి, ఆర్ఐ హేమమాలిని, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సమాధుల పండుగకు ఏర్పాట్లు

దెందులూరు: సమాధుల పండుగకు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబర్ 2న జరిగే సమాధుల పండుగలో మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు సమాధుల తోటలకు వచ్చి సమాధులను రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	10
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	22
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	06
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	09
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	18
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	23
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	15
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	09
ఏలూరు – తిరుపతి	16.00	4830	23

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36–42	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	64	చిక్కుడు కాయలు	00
వంకాయలు (కాంతులు)	40–72	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	56–64	ములక్కాడలు	07,10
బెండకాయలు	52–56	కంద	60
పచ్చిమిర్చి	40–44	బీట్‌రూట్	40–48
కాకర కాయలు	46–64	కీరా దోస	36
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	00
బీరకాయలు (పందిరి)	60	అల్లం	80
క్యాబేజీ	32–36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	50–60	పాలకూర	15
దొండకాయలు	34	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	40,50,55	గోంగూర	07
గోరుచిక్కుడు	50	పుదీనా	05
దోసకాయలు	40–48	బఠాణీ	--
ఆనబకాయ (1)	30–40	క్యాప్సికమ్	84–96
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	36